# మానవ హక్కులు... మానవ మనుగడకు కీలకం...

మానవుల మనుగడకు అవసరమైన కనీస సదుపాయాలే మానవ హక్కులు. ఇవి కుల, మత, ప్రాంత, లింగ భేదాలకు అతీతం. ఇవి రాజకీయాధికారి అనుగ్రహించే ప్రసాదం కావు. మానవ హోదాను పరిరక్షించడానికి మానవ హక్కులు అవసరం. చట్టం ఈ మానవ హక్కులను గుర్తించి అమలుకు కృషి చేస్తోంది. 'పౌర స్వేచ్ఛలో జోక్యం చేసుకోవడానికి రాజ్యం ప్రయత్నించినప్పుడు అడ్డుపడే తురుపు ముక్క లాంటివి.' అని రోనాల్డ్ డ్వార్కిన్ అభిప్రాయపడ్డాడు. జాక్ డోన్నీ అనే మేధావి అభిప్రాయంలో 'నాగరికతకు నూతన ప్రమాణాలే హక్కులు.' 20వ, 21వ శతాబ్ద నినాదం 'అందరికీ మానవహక్కులు'. వీటి ప్రధాన లక్షణాలివే..

- వివక్ష నుంచి స్వాతంత్ర్యం- కుల, మత, లింగ, తెగ, ప్రాంతీయ వివక్షకు గురి కాకుండా ఉండటం
- లేమి నుంచి స్వాతంత్ర్యం- గౌరవ ప్రదమైన జీవన ప్రమాణాలు అనుభవిం చటం
- వ్యక్తిలోని బిడీకృతమైన శక్తి సామర్థ్యాలను ఉపయోగిం చుకునే స్వాతంత్ర్యం
- భయం నుంచి స్వాతంత్ర్యం- ప్రాణానికి భద్రత, విచక్షణారహి తంగా ఎలాంటి హింస, నిర్బంధానికి గురి కాకుండా ఉండటం
- అధర్మం నుంచి స్వాతంత్ర్యం
- ఆలోచన, వాక్ స్వాతంత్ర్యం, సంఘాలుగా ఏర్పడే స్వాతంత్ర్యం
- గౌరవప్రదమైన పనిచేసుకునే స్వాతంత్ర్యం- పీడనాన్ని నిరోధించే హక్కు.

మానవ హక్కులు, మానవాభ్యుదయం..రెండిటిదీ విడదీ యరాని బంధం. ఐక్యరాజ్యసమితి చార్టర్లో, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనలో, ఇతర అంతర్జాతీయ చార్టర్లలో మానవ హోదా (Dignity)ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారత రాజ్యాంగం కూడా పీఠికలో మానవ హోదాను ప్రాథమిక విలువగా పేర్కొంది. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన ఐరాసలో రూపుదిద్దుకుంటున్న తరుణం లోనే (1948) మన రాజ్యాంగ రూపకల్పన కూడా కొనసాగింది. రాజ్యాంగంలో మూడో భాగంలో వివరించిన ప్రాథమిక హక్కులు, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చార్టర్లోని 2 నుంచి 21 వరకూ ప్రకరణలు దాదాపు ఒకటే. రాజ్యాంగంలో నాల్గో భాగంలో వివరిం చిన ఆదేశసూత్రాలు, ఐక్యరాజ్యసమితి మానవహక్కుల చార్టర్లోని 22 నుంచి 28 ప్రకరణలు ఒకటే. 1966లో ఐరాస ఆమోదించిన 'అంతర్జా తీయ పౌర, రాజకీయ హక్కుల ఒప్పందం', 'అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక,సాంస్కృతిక హక్కుల ఒప్పందం' మానవహక్కుల పరిధిని మరింత విస్తృతం చేశాయి.

## శతాబ్దాల నాటి ఆలోచన

మానవహక్కుల భావనను కేవలం రెండో ప్రపంచ యుద్ధానం తరం వచ్చిన ఆలోచనగా భావిస్తున్నారు. వాస్తవానికి 'హక్కు'ల భావన అమెరికా స్వాతంత్ర్య ప్రకటన (1776)లో ఒక ముఖ్య నినాదం. మానవులంతా సమానులు. అన్యాక్రాంతం చేయడానికి వీలులేని హక్కులను సృష్టికర్త ప్రసాదించాడు. ఫ్రెంచి విప్లవ ప్రకటన (1789) కూడా దాదాపు ఇదే అభిప్రాయాన్ని తెలియ జేస్తుంది. 'మానవులు స్వతంత్రులుగా పుట్టి స్వతంత్రంగా కొనసాగుతూ సమాన హక్కుల తో ఉంటారు.'

దురదృష్టవశాత్తూ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో పలు కారణా లతో హక్కులు ఉల్లంఘన జరుగుతోంది. అంత ర్జాతీయంగా మావన హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయడానికి ఐరాస మానవహక్కుల కమిషన్ను 1946 డిసెంబర్ పదిన ఏర్పాటు చేశారు. సాంఘిక, ఆర్థిక మండలిలో అంతర్భాగమైన ఈ కమిషన్లో 53సభ్య దేశాలకు మూడేళ్ల పదవీ కాలానికి సభ్యత్వముండేది. ప్రతి ఏటా 1/3 వంతు మంది పదవీ విరమణ చేసేవారు. మానవ హక్కుల ప్రోత్సాహం, పరిరక్షణ కార్య కలాపాల నిర్వహణకు ఒక ఉప కమిషన్ పని చేసేది. కమిషన్ పనితీరు అనేక విమర్శలకు గురవడంతో దాని స్థానంలో 2006 మార్చి మూడున మానవ హక్కుల కౌన్సిల్ ఏర్పాటయింది.

## భారత్పై విమర్శల వెల్లువ

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్లో 6, 7 దశ కాల్లో మానవహక్కుల ఉల్లంఘన (ప్రభుత్వ, సామాజిక పరంగా) మితిమీరుతోందని, విమర్శలు వచ్చాయి. సగటు పౌరునికి ప్రాణర క్షణ, వాక్ స్వాతంత్ర్యం మొదలైనవి నానాటికీ కరవవుతున్నాయని పౌర సమాజం ఉద్యమించింది. రాజకీయ నాయకుల్లో, ప్రభుత్వోద్యో గుల్లో జవాబుదారీతనం సన్నగిల్లింది. దీంతో జాతీయ, రాష్ట్ర స్థాయి ల్లో మానవహక్కుల కమిషన్ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ 1993 మానవ హక్కుల పరి రక్షణ చట్టం అమల్లోకి వచ్చింది. దీనిని 2006లో సవరించారు.

## జాతీయ మానవహక్కుల కమిషన్

ఇది బహుసభ్య వ్యవస్థ. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షు నిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి (పదవిలో ఉన్న లేదా విరమణ చేసిన), హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (పదవిలోనున్న లేదా విరమణ చేసిన), మానవహక్కుల కార్యకలాపాల్లో చురుకుగా ఉన్న ఇద్దరు వ్యక్తుల్ని సభ్యులుగా నియమిస్తారు. భారత ప్రధాన న్యాయ మూర్తి అనుమతి లేకుండా పదవిలో ఉన్న న్యాయమూర్తులను సభ్యు లుగా నియమించకూడదు. ప్రధానమంత్రి నేతృత్వంలో అంతరంగిక వ్యవహారాల మంత్రి, లోక్సభ స్పీకర్.. లోక్సభ, రాజ్యసభల్లోని ప్రతిపక్ష నాయకులు, రాజ్యసభ ఉపాధ్యక్షులు సభ్యులుగా ఉన్న కమిటీ సిఫార్సు మేరకు కమిషన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. పదవీకాలం ఐదు సంవత్సరాలు లేదా 70 సంవత్సరాలు వయసు వచ్చేంత వరకు (ఈ రెండిటిలో ఏది ముందు సంభవిస్తే అది). అధ్య క్షుడి పదవీ కాలం ఐదేళ్లు. సాధారణ సభ్యులు రెండుసార్లు పదవిలో

SAKSHI

(పదేళ్లు) కొనసాగవచ్చు. అయితే 70 సంవత్సరాల వయోపరిమితి నిబంధన వర్తిస్తుంది. పూర్తి కాల సభ్యులతో పాటు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అల్ప సంఖ్యాక వర్గాల కమిషన్, జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షులు పదవీ రీత్యా సభ్యత్వాన్ని పొందుతారు. కమిషన్ ముఖ్య కార్య నిర్వహణాధికారికి సెక్రటరీ జనరల్ హోదా ఉంటుంది. ఈ అధి కారికి భారత ప్రభుత్వ కార్యదర్శి స్థాయి ఉంటుంది. విచారణ విధులు నిర్వర్తించడానికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ స్థాయి పోలీసు అధికారి, ఇతర సిబ్బంది తోడ్పడతారు.

## తొలగింపు

కమిషన్ సభ్యుల తొలగింపు ప్రక్రియ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులను తొలగించే విధంగా ఉంటుంది. సభ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే విధానం...

- దుష్ప్రవర్తన, అసమర్థత లాంటి అభియోగాలు నమోదైనపుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి, ఆ న్యాయమూర్తి సిఫార్సు మేరకు రాష్ట్రపతి క్రమశిక్షణ చర్య తీసుకుంటారు.
- దివాలా తీయడం, శారీరక, మానసిక దౌర్బల్యానికి గురవడం, ఆదాయాన్నిచ్చే మరేదైనా పదవిలో కొనసాగడం, నైతికంగా దిగజారడం లాంటి ఆరోపణలు వచ్చినప్పుడు రాష్ట్రపతి స్వయంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

## విధులు

ఎ) కమిషన్ స్వయంగా లేదా బాధితుని ఫిర్యాదు మేరకు లేదా న్యాయస్థాన ఉత్తర్వు మేరకు... i) హక్కుల ఉల్లంఘన జరిగినపుడు ii) ప్రభుత్వోద్యోగి నిర్లక్ష్య వైఖరి వల్ల హక్కుల ఉల్లంఘన నివారించకుంటే విచారణ చేయడం

బి) న్యాయస్థానం అనుమతి మేరకు మానవహక్కుల ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించిన కార్య వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం

సి) ప్రభుత్వ నిర్వహణలోని సంస్థలను, జైళ్లను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయడం

డి) మానవహక్కుల పరిరక్షణకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను, శాసన సభలు రూపొందించిన చట్టాలను సమీక్షించి వాటిని ప్రభావవంతంగా అమలు చేయడానికి సూచనలివ్వడం

ఇ) ఉగ్రవాద కార్యకలాపాల వల్ల మానవహక్కులకు భంగం కలుగుతున్న పరిస్థితులను సమీక్షించి నివారణ చర్యలను సూచించడం

ఎఫ్) అంతర్జాతీయ ఒప్పందాలను అధ్యయనం చేసి అవి మానవహక్కులకు ప్రతిబంధకాలుగా ఉంటే తగిన నివారణ చర్యలు సూచించడం

జి) మానవహక్కులకు సంబంధించిన అంశాలపై పరిశోధన

హెచ్) సమాజంలో మానవహక్కుల అక్షరాస్యతను ప్రోత్సహించి, ప్రజల్లో అవగాహన కల్పించడం

ఐ) స్వచ్ఛంద సేవా సంస్థలను మానవహక్కుల పరిరక్షణకు కృషి చేసేటట్లు ప్రోత్సహించడం

జె) అవసరమైన విధులు నిర్వహించడం వంటి విధుల్ని మానవ హక్కుల కమిషన్ నిర్వర్తిస్తుంది.

## అధికారాలు

తనకున్న విధులను నిర్వహించడానికి కమిషన్‌కు అనేక అధికారాలుంటాయి. అవి.

1) సివిల్ కోర్టుకున్న అధికారాలను కలిగుంటుంది. ఆ మేరకు సాక్షులకు సమన్ల జారీకి, వారిని విచారించడానికి అవసరమైన అధికార పత్రాలను వెదకి, సమర్పించడానికి

- అఫిడవిట్లను, సాక్ష్యాధారాలను సేకరించడానికి
- న్యాయస్థానం లేదా ప్రభుత్వ కార్యాలయం నుంచి అవసర సమాచారాన్ని పొందడానికి
- సాక్షులను, అధికార ప్రతులను విచారించి, పరిశీలించడానికి
- ఇతర విషయాలను రూపొందించడానికి

2) కమిషన్ తాను దర్యాప్తు చేస్తున్న కేసును, మేజిస్ట్రేట్‌కు పంపడానికి

3) రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కు ఏదైనా కేసును బదిలీ చేయడానికి అధికారం ఉంటుంది.

విచారణ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవచ్చు. ఆ సమయంలో సదరు ఉద్యోగులు కమిషన్ పరిధిలో పని చేస్తారు. తనకందిన ఫిర్యాదులపై తగిన సమాచారం ఇవ్వాలని సంబంధిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలను కమిషన్ కోరవచ్చు. సకాలంలో ప్రభుత్వం నుంచి తగిన సమాచారం లభించకపోతే తానే స్వయంగా విచారణ నిర్వహించవచ్చు. విచారణ ముగిసిన తర్వాత, కమిషన్ దృష్టిలో మానవహక్కుల ఉల్లంఘన జరిగితే: i) బాధితునికి లేదా వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారమివ్వాలని ii) కారకులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయవచ్చు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టుల దృష్టికి తీసుకెళ్లి తగిన ఉత్తర్వులు (రిట్లు) జారీ చేయమని కోరవచ్చు.

## సాయుధ బలగాలకు సంబంధించిన కేసులు

సాయుధ బలగాలు మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డాయని ఫిర్యాదులు అందినప్పుడు తగిన వివరణ ఇవ్వమని ప్రభుత్వాన్ని కోరే అధికారం కమిషన్‌కు ఉంది. వివరణ ప్రాతి పదికగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతుంది. ప్రభుత్వం తాను తీసుకున్న చర్యల వివరాలు కమిషన్‌కు తెలియజేయాలి. కమిషన్ వార్షిక నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుంది. దాన్ని పార్లమెంట్‌లో నివేదిస్తారు.

## రాష్ట్ర మానవహక్కుల కమిషన్

దీని వ్యవస్థీకరణ జాతీయ కమిషన్‌ను పోలి ఉంటుంది. పదవీ విరమణ చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షునిగా, హైకోర్టు లేదా జిల్లా కోర్టు న్యాయమూర్తి (పదవిలో కొన సాగుతున్న లేదా పదవీ విరమణ చేసిన), మానవహక్కుల పరిరక్షణ కార్యకలాపాల్లో

SAKSHI

విస్తృత అనుభవమున్న ఒక వ్యక్తి పూర్తి కాల సభ్యులుగా కొనసాగు తారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో విధానసభ స్పీకర్, హోంమంత్రి, విధానసభ, విధాన పరిషత్‌లలో ప్రతిపక్ష నాయకులతో కూడిన కమిటీ చేసిన సిఫార్సుల మేరకు కమిషన్ సభ్యులను గవర్నర్ నియ మిస్తారు. ఆంధ్ర ప్రదేశ్‌తో సహా పదహారు రాష్ట్రాల్లో కమిషన్లు ఏర్ప డ్డాయి. కమిషన్ విధి విధానాలు జాతీయ కమిషన్ మాదిరిగానే ఉంటాయి. ఏడో షెడ్యూల్లో రెండు, మూడు జాబితాల్లో(రాష్ట్ర, ఉమ్మడి జాబితాలు) పొందుపర్చిన అంశాలకు సంబంధించిన మానవ హక్కు ల ఉల్లంఘన ఫిర్యాదులను పరిశీలిస్తుంది. వార్షిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తే,తర్వాత దాన్ని శాసనసభలో ప్రవేశపెడతారు.

## నమూనా ప్రశ్నలు

1.ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్ ఎప్పుడు ఏర్పాటైంది?

ఎ) 1945 బి) 1946

సి) 1947 డి) 1948

2. జాతీయ మానవహక్కుల కమిషన్ ప్రస్తుత ఛైర్మన్?

ఎ) జస్టిస్ రాజేంద్రబాబు

బి) జస్టిస్ డా. ఆనంద్

సి) జస్టిస్ కృష్ణ అయ్యర్

డి) జస్టిస్ బాలక్రిష్ణన్

3. ఆంధ్రప్రదేశ్ మానవహక్కుల కమిషన్ ప్రస్తుత చైర్మన్?

ఎ) జస్టిస్ ధవే

బి) జస్టిస్ సుభాషణ్ రెడ్డి

సి) జస్టిస్ ఆనందరెడ్డి

డి) జస్టిస్ లక్షణ్

4. రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సభ్యులను తొలగించే అధికారం ఎవరికి ఉంది?

ఎ) రాష్ట్ర గవర్నరు

బి) రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

డి) రాష్ట్రపతి

5.మానవహక్కుల కమిషన్ సభ్యుల పదవీకాలం?

ఎ) అరవై రెండేళ్ల వయసు వచ్చేంత వరకు

బి) అరవై ఐదేళ్ల వయసు వచ్చేంత వరకు

సి) డెబ్బయ్యేళ్ల వయసు వచ్చేంతవరకు లేదా అయిదు సంవత్సరాలు (ఏది ముందైతే అది)

డి) సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మాదిరి

**జవాబులు**

1) బి 2)ఎ 3) బి 4) డి 5) సి

SAKSHI